ప్రజాశక్తి

మంగళవారం 11 ఏప్రిల్ 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

గ్రావెల్ తరలిస్తున్న లారీలను నిలిపేసిన అధికారులు

అక్రమ మైనింగ్‌పై

విజిలెన్స్ దాడులు

3 టర్బో లారీలు,

ప్రొక్లయినర్ స్వాధీనం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేని ప్రాంతంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న వారిపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. మూడు టర్బో లారీలు, ప్రొక్లయిన్ స్వాధీనం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని బొల్లాపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. రీజినల్ విజిలెన్స్ అధికారి జగన్నాథరావు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లాపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 526లో అక్రమ గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్నారంటూ జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అధికారుల తనిఖీలలో గ్రావెల్ తవ్వకాల కోసం వినియోగిస్తున్న ఒక ప్రొక్లయిన్‌తో పాటు మూడు టర్బో లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకొని.. సోమవారం రాత్రి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. అనుమతులు లేని ప్రాంతంలో అక్రమంగా తవ్వకాలు నిర్వహించినట్లు గుర్తించామని, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న కోలలపూడి గ్రామానికి చెందిన గద్దల రాజేంద్రపై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అక్రమ తవ్వకాలకు సంబంధించిన జరిమానా వివరాల నివేదికను ఉన్నతాధికారులకు ▶ 2లో

డీఎస్సీ అభ్యర్థుల్లో నిరాశ

- అరకొరగా 1998 క్వాలిఫైడ్ అభ్యర్థుల టీచర్ పోస్టులు
- 726 మంది మందికి గానూ 165 మందికే..
- 25 ఏళ్లుగా నిరీక్షిస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన రాష్ట్రప్రభుత్వం చివరకు అరకొరగా ఉద్యోగాలను భర్తీ చేస్తుండటంతో 25 ఏళ్లుగా టీచర్ పోస్టు కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు నిరాశ చెందుతున్నారు. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేస్తూ ప్రభుత్వం గత నెలలో జీవో నెంబర్ 27న ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 4534 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకుంటామని చెప్పారు. ఈ మేరకు వీరందరికీ కౌన్సిలింగ్ నిర్వహించి నియామకపు ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు సంబంధించి గత ఏడాది ఆగస్టు నెలలో ఒంగోలులోని డిఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో అర్హతా పత్రాల పరిశీలన జరిపారు. సర్టిఫికెట్ల పరిశీలనకు 726 మంది హాజరయ్యారు. నూతనంగా విడుదల చేసిన జీవోలో 60 ఏళ్లపైబడిన వారిని అనర్హులుగా ప్రకటించడంతో ఈ కారణంగా అర్హులైన వారిలో సుమారు 100 మందికి పైగా తప్పుకోవలసి ఉంటుందని భావించారు. అప్పటి డీఎస్సీలో వచ్చిన క్వాలిఫైయింగ్ మార్కులతో పాటు ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులు పరిగణనలోకి తీసుకుని ఇప్పుడు రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన నూతన మార్గదర్శకాల మేరకు కౌన్సిలింగ్ జరిపి మినిమం టైమ్‌స్కేల్ పద్ధతిలో నెలకు రూ.34 వేతనంతో నియామకాలు జరగాల్సి ఉంది. రోస్టర్ కమ్ మెరిట్ ప్రాతిపదికన రిజర్వేషన్లను కూడా పరిగణనలోకి తీసుకొని జిల్లాకు కేటాయించిన పోస్టుల సంఖ్య ఆధారంగా నియామకాలు ఉంటాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా జరిపిన అర్హతా పత్రాల పరిశీలనలో 6,852 మంది అప్పట్లో అర్హులు గా తేలారు. అనంతరం మార్చి నెలలో జారీ చేసిన జీవో ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 4,534 పోస్టులు మాత్రమే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దీని ప్రకారం ఉమ్మడి ప్రకాశంలో అర్హులుగా తేలిన 726 మందిలో కనీసం 600 మందికి అయినా పోస్టులు దక్కుతాయని భావించారు. కానీ ఏడాది కాలంగా అర్హులం దరికీ ఉద్యోగాలు ఇస్తామన్న ప్రభుత్వం జిల్లాల్లో పోస్టులు ఖాళీలు లేవన్న కారణంతో అర్హుల్లో కొద్దిమందికి మాత్రమే నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 726 మందికి గానూ 165 మందికి టీచర్ పోస్టుల్లో భర్తీ చేయనున్నట్లు ప్రకటిం చారు. మొదట్లో 1998 డిఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం దశలవారీగా పోస్టుల్లో కోత విధించడంతో క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగం అందని ద్రాక్షలా మారింది. 25 ఏళ్లుగా పోరాటం చేసిన డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు మరోసారి ప్రభుత్వ పెద్దలను కలిసేందుకు తాడేపల్లి బాట పట్టారు.

అన్ని శాఖల అధికారులు

సమన్వయంతో పనిచేయాలి

- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- సిఎం జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఎలాంటి సమస్య రాకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సిఎం జగన్ ఈ నెల 12న మార్కాపురం రానున్న సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను, భద్రతను కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్, ఎస్‌పి మల్లికగర్గ్ అధికార యంత్రాంగంతో కలిసి సోమవారం పరిశీలించారు. సిఎం జగన్ మోహన్‌రెడ్డి మార్కాపురం ఎస్‌వికెపి కళాశాల ప్రాంగణం వేదికగా ఇబిసి నేస్తం పథకాన్ని ఈ నెల 12వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్‌పి మల్లికగర్గ్, ఎస్ఎస్‌డి ఆఫీసర్స్... అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఎఎస్ఎల్) నిర్వహించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. అందులో భాగంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణించే హెలికాప్టర్ దిగేందుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ప్రత్యేకంగా నిర్మించిన హెలిప్యాడ్‌ను, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఇంకా మిగిలిపోయిన ఏర్పాట్లను వేగంగా చేపట్టాలని ఆదేశించారు. సిఎం జగన్ కాన్వాయ్‌కి సంబంధించిన రూట్‌మ్యాప్‌ను పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణం చుట్టూ బారికేడ్ల ఏర్పాటు, ఎస్‌వికెపి డిగ్రీ కళాశాల మైదానంలో సిఎం జగన్ ప్రసంగించేందుకు ఏర్పాటుచేసిన సభా వేదిక నిర్మాణం, ప్రజలు లోపలికి వచ్చే, పోయే మార్గాలను, వివిఐపి, విఐపి వాహనాల పార్కింగ్ స్థలాల వద్ద బందోబస్తు వంటి చర్యలను సమీక్షించిన అనంతరం పలు సలహాలు, సూచనలు చేశారు.

సభా ప్రాంగణం చుట్టూ గట్టి దోబస్తు ఏర్పాటు చేయాలని, అధికారులు, ముఖ్య నాయకుల వాహనాలకు, ఇతరుల వాహనాలకు పార్కింగు స్థలాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ మల్లికగర్గ్ ఆదేశించారు. బందోబస్తుకు పోలీస్ అధికారుల నుంచి సిబ్బంది వరకు సుమారు 1700 మందిని వినియోగిస్తున్నామన్నారు. ఇక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, సబ్ కలెక్టర్ సేతు మాధవన్, ట్రైనీ ఐపిఎస్ అధికారి అంకిత సురాన, అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్ఎస్‌జి డిఎస్‌పిలు జి.విశ్వనాథ్, కె.శ్రీనివాస్, డిఎస్‌బి డిఎస్‌పి బి.మరియదాసు, మార్కాపురం డిఎస్‌పి డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్, దర్శి డిఎస్‌పి నారాయణస్వామి రెడ్డి, దిశ డిఎస్‌పి పల్లపురాజు, డిటిసి డిఎస్‌పి రామకృష్ణ, ఎఆర్ డిఎస్‌పి వెంకటేశ్వర్లు, సిఐ భీమానాయక్, ఆర్ఐ శ్రీహరిరెడ్డి ఉన్నారు.

తాడేపల్లిలో నిరసన తెలుపుతున్న కొండపి వైసిపిలోని ఓ గ్రూపు

'వరికూటి'ని ఇన్‌ఛార్జిగా తొలగించాలి

▲ 8లో

ఐజికి సత్కారం

సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు రేంజ్ ఐజి డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ విశాఖపట్నం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎస్పీలు, అధికారులు ఐజి దంపతులను ఘనంగా సత్కరించారు.

- ప్రజాశక్తి, ఒంగోలు క్రైం

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

ప్రజాశక్తి -శింగరాయకొండ

ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ పాత శింగరాయకొండ సర్పంచి వల్లూరి రాజ్యలక్ష్మి శింగరాయకొండ తహశీల్దారు సిహెచ్.ఉషాను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పాత శింగరాయకొండ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 309లో 94 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలిపారు. అందులో గ్రామానికి చెందిన రైతులు తమ పశువులు, గొర్రెలు మేపుకుంటున్నట్లు తెలిపారు. అక్కడే కుంటలో నీళ్లతో పశువుల, గొర్రెల దాహార్తీ తీర్చుకుంటున్నట్లు తెలిపారు. అయితే సోమరాజుపల్లి కి చెందిన రావినూతల ఏడుకొండలు, మల్లేశ్వరి అనే వారు ఆ భూమిని ఆక్రమించి మామిడి చెట్లు సాగు చేసినట్లు తెలిపారు. అదేమని అడిగితే ఆ భూమి మా తాతలనాటి నుంచి తమదేనని బెదిరింపులకు గురిచేస్తున్నట్లు సర్పంచి రాజ్యలక్ష్మి వివరించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని ఆమె కోరారు.

తహశీల్దారు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచి

అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ దాడులు

(మొదటిపేజీ తరువాయి)

పంపించిన అనంతరం వివరాలు తెలియజేస్తామని అసిస్టెంట్ జియాలజిస్ట్ సురేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ టెక్నికల్ అసిస్టెంట్ రాజినాయుడు, కోలలపూడి వీఆర్వో రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దాడుల వెనుక నేపథ్యం ఇదేనా.?

మండల పరిధిలోని బొబ్బేపల్లి గ్రామానికి చెందిన వీరాంజనేయులు, హైకోర్టు న్యాయవాది వేముల బేబీరాణి సోమవారం బాపట్ల జిల్లా కేంద్రం, కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్ లో జిల్లా కలెక్టర్ తో పాటు ఎస్పీకి, ఇతర మైనింగ్ అధికారులకు మైనింగ్ అక్రమాలపై ఫిర్యాదు చేశారు. బొబ్బేపల్లి గ్రామంలో గ్రావెల్ తవ్వకాలు నిర్వహించడానికి కుంచపు వీరాంజనేయులుకి చట్టపరమైన అన్ని అనుమతులున్నప్పటికీ గ్రావెల్ తవ్వకాలు నిర్వహించకుండా స్థానిక పోలీస్ అధికారి అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ గ్రీవెన్స్‌సెల్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుండి అన్ని అనుమతులున్న వారిని అడ్డుకుంటూ.. ఎటువంటి అనుమతులు లేని వారు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతుంటే వారిని వదిలి తమను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారంటూ వీరాంజనేయులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన విజిలెన్స్ మైనింగ్ అధికారులు మొదట బొల్లాపల్లి గ్రామంలో దాడులు నిర్వహించి.. అక్రమంగా మైనింగ్ తవ్వకాలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం కూడా బొబ్బేపల్లి గ్రామంలో తనిఖీలు నిర్వహించి వాస్తవంగా ఏమి జరుగుతుందో తెలుసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

కాలువలో పడిపోయిన ఆవు

తక్షణమే స్పందించిన మేయర్

ఒంగోలు సబర్బన్ : స్థానిక 14వ డివిజన్ సంతపేట వెటర్నరీ ఆసుపత్రి దగ్గర ఓ ఆవు ప్రమాదవశాత్తు సోమవారం కాలువలో పడిపోయింది. ఈ విషయం గురించి తెలుసుకున్న నగర మేయర్ గంగాడ సుజాత తక్షణమే స్పందించారు. వెంటనే జెసిబిని తెప్పించి ఆవును రక్షించే చర్యలు చేపట్టారు. ఆవు ప్రాణాన్ని కాపా డేందుకు స్పందించిన మేయర్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

వెలిగండ్లలో 'జగనన్నే మా భవిష్యత్'

వెలిగండ్ల : వెలిగండ్లలో జగనన్నే మా భవిష్యత్తు, నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ పొల్లా సుబ్రమణ్యం, సర్పంచి తాతపూడి సురేష్‌బాబు, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ అమీద్, వైసిపి మండల కార్యదర్శి గంజి రవీంద్రారెడ్డి, ఆకుల రాజ్‌కుమార్ నాయుడు, రంగయ్య, కృష్ణ, వాలంటీర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

మద్దిపాడు ఎస్ఐగా శ్రీకాంత్

ప్రజాశక్తి-మద్దిపాడు

మద్దిపాడు ఎస్ఐగా బి. శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన్న టి. శ్రీరామ్‌ను అధికారులు విఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో సంతనూతలపాడు ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీకాంత్ బదిలీపై ఇక్కడ విధులు చేశారు.

సంతనూతలపాడు ఎస్ఐగా ఆంజనేయులు

ప్రజాశక్తి -సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడు ఎస్ఐగా వి. ఆంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీకాంత్ బదిలీపై మద్దిపాడు వెళ్లారు. ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆంజనేయులుకు పోలీస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

కొత్తపట్నం ఎస్ఐగా సాంబశివరావు

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం ఎస్ఐగా బి. సాంబశివరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కొక్కిలిగడ్డ మధుసూదన్ విఆర్‌కు బదిలీ అయ్యాడు. ఆయన స్థానంలో సాంబశివరావు బాధ్యతలు చేపట్టారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

మద్దిపాడు : గర్భిణులు మనోధైర్యంగా ఉండాలని మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ డి. మానస తెలిపారు. పి ఎం సురక్షిత మాత్రుత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు ఈ సందర్భంగా. హిమోగ్లోబిన్, బీపీరక్తనమూనా, శిశువు కదలిక తదితర పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారికి ఐరన్ సిరప్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ లలితమ్మ, పిహెచ్ఎన్ రాంజితకుమారి, ఎంపిహెచ్ఇఒ వెంకటరెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నాగులుప్పలపాడు : అమ్మనబ్రోలు గ్రామంలోని బాలికల గురుకుల ఉన్నత పాఠశాలలో 5,6,7,8. తరగతుల ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శైలజ ప్రియదర్శిని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల24లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హుండీ ఆదాయం రూ.15,38,196

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి హుండీ ఆదాయం రూ. 15,38,196 వచ్చినట్లు ఆలయ ఇఒ ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ నెల 6 నుంచి 8 వరకూ శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం వారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కన్నసాని చిన్నఓబులేసు ,ఆలయ ధర్మకర్తల మండల సభ్యులు ,అర్చకులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : వరికూటి

ప్రజాశక్తి- జరుగుమల్లి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని ఎడ్లూరుపాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం అశోక్‌బాబు మాట్లాడుతూ పేదల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో వైస్ ఎంపిపి చుండి శ్రీలత శ్రీనివాసరావు, చుండూరి శ్రీనివాసులు, చుండి సురేష్, కసుకుర్తి బద్రి, స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెంబర్1238/2019

పత్తిపాటి రామమూర్తి ....వాది

వర్సెస్

1తడకలూరి బాల కోటయ్య

2 బొలినేని శ్రీహరిరావు .... ప్రతివాదులు

నోటీసు

తడకలూరి బాలకోటయ్య,
తండ్రి కోటయ్య వయస్సు 40 సం.లు హిందూ రాడ్ బెండింగ్, వెల్డింగ్ వర్కర్ డోర్ నెంబర్ :56-1-42 పోతురాజు పాలెం దగ్గర, అన్నవరప్పాడు ,ఒంగోలు.

వాది తనకు ప్రతి వాదుల నుండి రావలసిన బాకీ కై పై దావా 1238/2019 దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు నోటీసు పంపిననూ ముట్టనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా తేది 18-04-2023 న ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేనిచో మీ పరోక్షమందు విచారణ జరిపి తీర్మానించబడునని తెలియపరచడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

ఇట్లు
పి.చలపతిరావు
వాది తరపు అడ్వకేట్
ఒంగోలు

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE: MARKAPUR

I.A. 193/2021
IN
OS 129/2021

Dara Chandrakala, W/o Ranga Sai, aged about 30 years, Hindu, Coolie, R/o Drivers Colony, Railway Station Road, Markapur Town and Mandal, Prakasam Dt. and Others .... Petitioners/Plaintifffs

Vs

Naru Venkata Reddy, aged 48 years, S/o. Venkata Reddy, Hindu, Business, R/o D.No. 1-203-A-185, 1st Ward, Markapur Town and Mandal, Prakasam Dt. and Others ...... Respondens/Deffendants

PETITION FILED UNDER ORDER 39 RULE 1 AND 2 C.P.C. ON BEHALF OF THE PETITIONERS/ PLAINTIFFFS

For the reasons stated in the accompanying affidavit, it is therefore prayed that the Honourable Court may be pleased to grant exparte ad-interim injunction orders in favour of the petitioners against the respondents/ defendants and restraining the respondents/ defendants, their relatives theirmen, followers, supporters from ever interfering with the peaceful possession and enjoyment of the petition schedule sites i.e., items 1 and 2 of the petition schedule by the petitioners/ plaintiffs, till the disposal of the main suit, in the ends of justice.

SCHEDULE

Prakasam District - Markapur Registration District and Sub-Registration District- Markapur Mandal - the sites are situated within the limits of Markapur Municipality.

Item No.1
Sy.No. 1213- an extent of 46 Square Yards.
Boundaries
North : House of 2nd plaintiff
South : House of Balusupati Galeiah.
West : Rastha.
East : Rastha.
Within the above boundaries an extent of 46 square yards.

Item No.2
Sy No. 1213 an extent of 46 Square Yards.
Boundaries
North : House of Chatti Hussenamma.
South : House of Plaintiff.
West : Rastha.
East : Rastha.
Within the above boundaries an extent of 46 square yards.

Be pleased to consider

V.Krishna Rao
Advocate for
Petitioners/plaintiffs

దావా సమను

ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెంబర్ 504/2019

నన్నపనేని సుబ్బారావు ....వాది

వర్సెస్

కందిమళ్ళ రామాంజనేయులు ...ప్రతివాది

To
కందిమళ్ళ రామాంజనేయులు తండ్రి
నారాయణస్వామి డోర్ నెంబర్
34-62-101,తాలూకా పోలీస్ స్టేషన్ దగ్గర
సుజాతనగర్, ఒంగోలు, ప్రకాశంజిల్లా

ఈ నెంబర్ లో ని వాది ప్రో నోటు బాకీని రాబట్టు కొనుటకు పై నెంబర్ దావా చేయగా మి నోటీసు నిమిత్తం తేది 12.05.2023 నకు వాయిదా వేసి ఉన్నారు కనుక ఆ రోజున ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయంగా గాని అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలసింది లేనియెడల మి పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడ మైనది

// కోర్టు వారి మేరకు ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
M. అజయ్ బాబు
G. రామమూర్తి
వాది తరపు న్యాయవాదులు
ఒంగోలు

దావాసమను

ఒంగోలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓఎస్ నెంబర్ 859/2019

దిగుమర్తి శివపార్వతి ....వాది

వర్సెస్

కందిమళ్ళ రామాంజనేయులు ....ప్రతివాది

To
కందిమళ్ళ రామాంజనేయులు,
తండ్రి నారాయణస్వామి
డోర్ నెంబర్ 34-62-101,తాలూకా పోలీస్ స్టేషన్ దగ్గర ,సుజాతనగర్ ఒంగోలు ,ప్రకాశం జిల్లా

ఈ నెంబర్ లో ని వాది ప్రో నోటు బాకీని రాబట్టు కొనుటకు పై నెంబరు దావా చేయగా మి నోటీసు నిమిత్తం తేది 20.04.2023 నకు వాయిదా వేసి ఉన్నారు కనుక ఆ రోజున ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయంగా గాని అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలసింది లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడ మైనది

వాయిదా తేదీ: 20-04-2023

// కోర్టు వారి మేరకు ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
M. అజయ్ బాబు
G. రామమూర్తి
వాది తరపు న్యాయవాదులు
ఒంగోలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ
కార్యనిర్వాహక ఇంజనీర్ వారి కార్యాలయం
ఒంగోలు విభాగం- ప్రకాశం జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటిస్ నెంబర్ **01 & 02/2023-24, తేదీ: 10-04-2023**

పనిపేరు : బాపట్ల జిల్లా, చీరాల మండలం, ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ మీద గల గవినివారిపాలెం ఎత్తిపోతల పథకమునకు మరమ్మత్తుల రెండు పనులు చేయుటకు **(MP LADS).** రెండు టెండర్లు

రెండు పనుల అంచనావిలువ : రూ.5.33 లక్షలు (రూ. 2.84 లక్షలు + రూ.2.49 లక్షలు)

పని పూర్తి చేయవలిసిన కాలము : ఒక నెల

పై పనుల కొరకు

ఎ) బిడ్ డాక్యుమెంట్లు డౌన్ లోడింగ్ ప్రారంభము	తేదీ : 11.04.2023 మధ్యాహ్నం 1:00 గం.
బి) బిడ్ డాక్యుమెంట్లు డౌన్ లోడింగ్ ముగింపు	తేదీ: 25.04.2023 మధ్యాహ్నం 1:30 గం.
సి) బిడ్ స్వీకరణకు చివరి తేదీ మరియు సమయము	తేదీ: 25.04.2023 సాయంత్రం 3:00 గం.
డి) బిడ్ తెరచు తేదీ మరియు సమయము	తేదీ: 25.04.2023 సాయంత్రం 4:00 గం.

తదుపరి వివరముల కొరకు www.eprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చును

కార్యనిర్వాహక ఇంజనీర్
ఎ.పి.ఎస్.ఐ.డి.సి,
ఒంగోలు, ప్రకాశం జిల్లా

భారంగా విద్యుత్ చార్జీలు

ఎమ్మెల్యే రవి కుమార్ వద్ద గోడు వెళ్లబోసుకున్న రైతులు

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి మండలంలోని శంఖవరప్పాడు గ్రామ మాజీ సర్పంచ్ బట్టు అంజయ్య తండ్రి యోగయ్య దశదిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను స్థానిక రైతులు, ఎస్సీ కాలనీ వాసులు పలువురు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారీతిన పెంచుతున్న విద్యుత్ చార్జీలు భారంగా మారాయని, మోటార్లకు మీటర్లు పెట్టుకోవాల్సిందేనంటూ విద్యుత్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 7సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన ఘనత జగన్‌రెడ్డిదేనని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ కోతలు గాని, చార్జీలు పెంచటంగాని జరగలేదని అన్నారు. 57 వేల కోట్ల విద్యుత్ ఛార్జీల భారాలు మోపిన జగన్‌రెడ్డిని ఎందుకు నమ్మాలని ప్రశ్నించారు. విద్యుత్ ఛార్జీలను పెంచలేదని ఒకవైపున నోటిఫికేషన్ జారీ చేస్తూ, మరోవైపు సర్దుబాటు చార్జీల పేరుతో దొడ్డిదారిన భారాలు వేయడం వైసిపి ప్రభుత్వ మోసకారితనానికి నిదర్శనమన్నారు. 2023 ఏప్రిల్ నుంచి రాష్ట్రంలో ప్రతి నెలా విద్యుత్ యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా సర్దుబాటు చార్జీలు (ట్రూఅప్) వసూలు చేయటాన్ని తీవ్రంగా

యోగయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రతి నెల వసూలు చేయడమే కాకుండా మళ్లీ సంవత్సరాంతంలో అవసరమైతే అదనంగా సర్దుబాటు భారం మోపే ప్రమాదం కూడా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం 1400 కోట్ల రూపాయలు విద్యుత్ ఛార్జీలకు పెంచి భారం మోపిందని, 2014-19 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు 36 నెలల పాటు యూనిట్‌కు 25 పైసలు చొప్పున వసూలు చేయడం దారుణమని అన్నారు. దీని వలన 2,900 కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతోందని, 2020-21లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు 65 పైసలు వరకు 2023 ఏప్రిల్ నుంచి అదనంగా వసూళ్లకు ఆదేశాలు ఇచ్చి సామాన్యుడి జేబులు గుల్ల చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ స్మార్ట్ మీటర్లు పెట్టి ఆ వ్యయాన్ని నెలవారీగా ప్రజలపై వేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బడా కార్పొరేట్ కంపెనీల నుంచి విద్యుత్ అధిక రేట్లకు కొనుగోలు చేస్తూ ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నారన్నారు. అదాని తదితర కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే రీతిలో బొగ్గు అధిక రేట్లకు కొనుగోలు చేసి సర్దుబాటు చార్జీల పేరుతో దండుకుంటున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచబోమని, తగ్గిస్తామని మాట చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మాట తప్పి ఈ రీతిలో భారాలు మోపటం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతినెల విద్యుత్ సర్దుబాటు చార్జీలు విధించి భారాలు వేసే ఆదేశాలను ఉపసంహరించుకోవాలని తెలుగుదేశం పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. వైసీపీ ప్రతి మోసాన్ని బయటపెడతామని అన్నారు. రైతులను మోసం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతుల మోటార్లకు మీటర్లు పెట్టడం లాభమని చెప్పడం జగన్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. విద్యుత్ భారాలను ప్రతిఘటించాలని ప్రజలకు ఎమ్మెల్యే గొట్టిపాటి పిలుపునిచ్చారు.

సేంద్రీయ పద్ధతిలో పంటలు సాగు చేయాలి

ప్రజాశక్తి-అద్దంకి

సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తే ఆరోగ్యవంతమైన పంట చేతికి వస్తుందని ఒడిస్సాలోని పర్లాకిమిడికి చెందిన సెంచూరియన్ యూనివర్సిటీ విద్యార్థులు జి అంకిత, బి మీనాక్షి తెలిపారు. పట్టణంలోని పలు కాలనీలలో రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో మాట్లాడుతూ పంట సాగులో క్రిమిసంహారక మందులు రసాయనిక ఎరువులు వాడకం కన్నా సేంద్రీయ పద్ధతిలో సాగు చేస్తే పంట దిగుబడితో పాటుగా నాణ్యమైన పంట చేతికొస్తుందని అన్నారు. పట్టణ మండలంలో రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసేందుకు చొరవ చూపాలని కోరారు. జీవామృతం తయారు చేసే విధానాన్ని వివరించి వాటి ఉపయోగాలను రైతులకు తెలియ జేశారు. జీవామృతం వాడకం వలన రైతుకు పెట్టుబడి తగ్గి నాణ్యమైన దిగుబడి రావడానికి మంచి అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అగ్రికల్చర్ విద్యను అభ్యసించిన విద్యార్థినులు

గుండెపోటుతో డీఎస్పీ వెంకటేశ్వరరావు మృతి

ప్రజాశక్తి-నిజాంపట్నం, బాపట్ల జిల్లా

నెల్లూరు జిల్లాలో డీఎస్పీగా పనిచేస్తున్న నిజాంపట్నం మండలం అచ్యుతపురం గ్రామానికి చెందిన కేసన వెంకటేశ్వరరావు ఈ నెల 8వ తేదీన శనివారం రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన 1991 బ్యాచ్‌కు చెందిన సివిల్ ఎస్ఐగా పోలీసు శాఖలో చేరి ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో పలు పోలీస్ స్టేషన్‌లలో, సర్కిల్ కార్యాలయాలలో ఎస్ఐగా, సీఐగా విధులు నిర్వర్తించారు. డిఎస్పీగా పదోన్నతి పొంది ఒంగోలు సీసీఎస్ పోలీస్ విభాగంలో తిరుపతి మహిళా పోలీస్ స్టేషన్‌లోనూ, ఆత్మకూరు సబ్ డివిజన్‌లోనూ డిఎస్పీగా విశేష సేవలందించారు. ప్రస్తుతం బదిలీపై వచ్చి డీజీపీ ఆఫీసుకు అటాచ్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తూ శనివారం రాత్రి గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం ఆయన స్వగ్రామమైన అచుత్యపురంలోని స్వగృహంలో వెంకటేశ్వరరావు పార్థివ దేహానికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఘన నివాళ్ళులర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసు శాఖలో డీఎస్పీ వెంకటేశ్వరరావు ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ విశేష సేవలు అందించారని వారు చెప్పారు. ఆయన లేకపోవడం తీరని లోటని అన్నారు. ఆయన అంత్యక్రియలను సోమవారం అచ్యుతపురంలో పోలీస్ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డీఎస్పీ జి లక్ష్మయ్య, రేపల్లె డీఎస్పీ టి మురళీకృష్ణ, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఏ. శ్రీనివాస్, రేపల్లె రూరల్ సీఐ ఏ శివశంకర్, రేపల్లె పట్టణ సీఐ ఎస్ విజయచంద్ర, చీరాల పట్టణ సీఐ వి మల్లికార్జునరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రముఖుల నివాళి

నెల్లూరు జిల్లాలో డిఎస్‌పిగా పనిచేస్తూ డిజిపి ఆఫీసుకు అటాచ్మెంట్‌లో డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించిన కేసన వెంకటేశ్వరరావు మృతదేహానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాల వేసి నివాళి అర్పించారు. బాపట్ల జిల్లా అడవుల దీవి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపట్నం మండలం అచ్యుతపురం గ్రామంలో సోమవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణ, చీరాల శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి, బిసి సంక్షేమ సంఘం రాష్ట అధ్యక్షులు కేశన శంకరరావు తదితరులు డిఎస్‌పి కె వెంకటేశ్వరరావు పార్థివ దేహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. శోకసంద్రంలో వున్న డీఎస్పీ కుటుంబ సభ్యులను, బంధువులను జిల్లా ఎస్పీ పరామర్శించారు. పోలీస్ శాఖకు వెంకటేశ్వరరావు చేసిన సేవలు ఎనలేనివని, ఆయన లేని లోటు తీర్చలేనిదని అన్నారు. ఆయన కుటుంబానికి పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని, శాఖాపరంగా కుటుంబానికి రావాల్సిన అన్ని రకాల పరిహారాలు, రాయితీలు సకాలంలో అందించడానికి కృషి చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం పోలీస్ శాఖ అధికార లాంఛనాలతో డీఎస్పీ పార్థివ దేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి జి లక్ష్మయ్య , రేపల్లె డిఎస్‌పి టి మురళీకృష్ణ, డిఎస్‌బి ఇన్‌స్పెక్టర్ ఏ శ్రీనివాస్, రేపల్లె రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ శివశంకర్, రేపల్లె పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్ విజయచంద్ర, చీరాల వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ వి మల్లికార్జునరావు ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. 1991 బ్యాచ్‌కు చెందిన కె వెంకటేశ్వరరావు సివిల్ ఎస్ఐగా పోలీసు శాఖలోకి ప్రవేశించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కరణం బలరాం (ఇన్‌సెట్‌లో) డిఎస్‌పి వెంకటేశ్వరావు (ఫైల్)

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి-మేదరమెట్ల రోడ్డులోని నల్లవాగు సమీపంలో రోడ్డు పక్కను యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లుగా కనిపిస్తోందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సిఐ ఎం రోశయ్య తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామవాసిగా మృతుడిని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అందిన వివరాల ప్రకారం స్వామి గతంలో పల్నాడు జిల్లాలో రైస్ మిల్లు భాగస్వామ్యంపై నడిపినట్లు, ఈ ఆర్థిక లావాదేవీల కారణంగానే అతడిని గుర్తుతెలియని దుండగులు వాహనంతో ఢీకొట్టి చనిపోయే విధంగా చేశారని కూడా ప్రచారం సాగింది. పోలీసులు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్యాప్తు చేపట్టారని సమాచారం.

ప్రమాదంలో ధ్వంసమైన టెంపో ముందు భాగం

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

రోడ్డు ప్రమాదం.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-జరుగుమల్లి

దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా నిద్రమత్తులో రోడ్డు ప్రమాదం జరగడంతో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మరి కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన 16వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు జరిగింది. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం, సిద్దిపేట జిల్లాకు చెందిన 12 మంది టెంపో వాహనంలో గత రెండు రోజుల క్రితం తిరుమల దైవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జరుగుమల్లి మండలం కె బిట్రగుంట జాతీయ రహదారి పై ఓవరు బ్రిడ్జి వద్దకు రాగా, నెల్లూరు నుంచి నూజివీడు వెళుతున్న ఎపి16 టిజె 6496 లారీని, ఎపి 05 టిసీ 5911 నెంబరు గల టెంపోను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో వాహనంలో ప్రయాణిస్తున్న నిర్మల, లత, టెంపో డ్రైవరు చారికి తీవ్ర గాయాలయ్యాయి. మరి కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. టెంపో వాహనం పూర్తి స్థాయిలో దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనంలో ఇరుక్కొనిపోయిన వారిని బయటకు తీశారు. గాయాలు అయిన వారిని హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. వాహనాలు రోడ్డుపై వుండటంతో వేషనల్ హైవే సిబ్బంది క్రేన్ సహాయంతో వాహనాలు పక్కన పెట్టించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు.

నాపై ఆరోపణలు నిరాధారం

- దళిత పారిశ్రామికవేత్త గురజాల రాజేష్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జగనన్న బడుగు వికాస పథకంలో తాను అక్రమాలకు పాల్పడినట్లు దళిత, ప్రజా సంఘాల నాయకులు చేసిన ఆరోపణలు నిరాధారమని దళిత పారిశ్రామికవేత్త గురజాల రాజేష్ పేర్కొన్నారు. ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్న బడుగు వికాసంపై రాయితీలన్నీ నిబంధనలకు అనుగుణంగానే దరఖాస్తు చేసుకున్నామన్నారు. మామిడి సుదర్శన్ అనే వ్యక్తి తమను బెదిరించారని, ఈ విషయమై దళిత ప్రజా సంఘాల నేతలతో ప్రెస్‌మీట్‌లు పెట్టి అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమ కుటుంబము ప్రభుత్వ పరంగా వచ్చే అవకాశాలతో స్వతంత్రంగానే ఎదుగుతున్నామన్నారు. ఈ విషయంలో డిక్కీ సంస్థకు గాని, ఈ సంస్థ అధ్యక్షుడు ఏ ఆశీర్వాదంకు గాని ఎలాంటి సంబంధం లేదని అన్నారు. ఈ సంస్థను వివాదంలోకి లాగవద్దని ఆయన కోరారు. దళిత పారిశ్రామికవేత్తగా ఎదుగుతున్న తనపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు.

వైద్యశాలకు కుర్చీలు అందజేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

పిహెచ్‌సికి కుర్చీలు వితరణ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజల అవసరార్థం వాసవీ క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు, విశ్రాంత ఉపాధ్యాయులు బిలిశెట్టి శ్రీనివాసరావు వితరణగా కుర్చీలో అందజేశారు. వైద్యశాలలో ఓపి సమయంలో రోగులు అధికంగా ఉన్నప్పుడు నిలబడి ఉండాల్సి వస్తుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని తనవంతు సహకారంగా కుర్చీలు అందజేసినట్లు శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

తాటి ముంజలు విక్రయిస్తున్న దృశ్యం

తాటి ముంజలకు గిరాకీ

ప్రజాశక్తి-సంతమాగులూరు

వేసవికాలంలో ప్రతి ఒక్కరూ ఇష్టపడి తినే తాటి ముంజలకు గిరాకీ పెరిగింది. ప్రతి ఏడాది సంతమాగులూరు, అడ్డ రోడ్డు జంక్షన్ గ్రామాల మధ్యలో రహదారికి పక్కనున్న చెట్ల కింద 20 మందికి పైగా వ్యాపారులు తాటికాయలు తెచ్చి, కాయ ఒకటి పది రూపాయల చొప్పున విక్రయించేవారు. ఈ ఏడాది ఒకరిద్దరు తప్ప తాటికాయలు అమ్మేవారు కనబడటం లేదు. రహదారుల వెంట ఉన్న తాటిచెట్లను రియల్ ఎస్టేట్ వ్యాపారులు తొలగించి, ఆ భూములపై వెంచర్లు వేయడంతో తాటి చెట్లు కనుమరుగవుతున్నాయి. దీంతో వ్యాపారులు సుదూర ప్రాంతం వెళ్లి అధిక ధరలతో తాటికాయలను కొనుగోలు చేయవలసి వస్తుందని వ్యాపారులు వాపోతున్నారు. దీంతో ఖర్చులు పెరగటంతో తాటి ముంజలకు గిరాకీ పెరిగిందని వారు తెలుపుతున్నారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా తాటికాయ 20 రూపాయలు పలుకుతోంద న్నారు. దీంతో వినియోగదారులు తాటి ముంజలను కొనుగోలు చేసేందుకు ముందుకు రావటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

ప్రజాశక్తి-బాపట్ల

జిల్లాలో పదో తరగతి పరీక్షలు నాలుగోరోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు విలేకరులకు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 42 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు, 3 కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షించారన్నారు. జిల్లాలో జరిగే పదో తరగతి పరీక్షలకు 17,032 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉంది. 16 వేల 884 విద్యార్థులు హాజరుకాగా, 168 విద్యార్థులు పరీక్షలకు గైరు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 103 సెంటర్లలో పరీక్షలు జరిగినట్లు ఆయన తెలిపారు.

సన్నకారు రైతులకు పండ్ల మొక్కలు: ఎంపీడీవో

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్న కారు, 5 ఎకరాల లోపు పొలం కలిగిన రైతులకు 100శాతం సబ్సిడీతో ఉచితంగా పండ్ల మొక్కలు అందజేస్తారని ఎంపీడీవో ఎం సాంబశివరావు తెలిపారు. పండ్ల మొక్కలు అయిన, నిమ్మ, మామిడి, సపోటా, బత్తాయి, కొబ్బరి, డ్రాగన్ ఫ్రూట్, తైవాన్ జామ, జామ, గులాబీ, మల్లె, సీతాఫలం, యాపిల్ బేర్, దానిమ్మ, నేరేడు, మునగ మొదలగు మొక్కలను ఇస్తామని తెలిపారు. సమాచారం కోసం ఎంపీడీవో, ఏపీవో, లేదా గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంటు వద్ద నమోదు చేసుకోవాలని సాంబశివరావు తెలిపారు.

అధికారుల పాపం.. లబ్ధిదారులకు శాపం

నీటి మూటలవుతున్న ముఖ్యమంత్రి మాటలు ● ఇబ్బంది పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-పంగులూరు

అధికారులకు ముందు చూపు లేక చేసిన పొరపాటు, జగనన్న కాలనీ లబ్ధిదారులకు శాపంగా మారింది. లక్షలాది రూపాయలు ప్రభుత్వ ధనం వృధా కాగా, లబ్ధిదారులకు మాత్రం ఇంటి జాగా దొరక్క ఇబ్బంది పడుతున్నారు. రాష్ట్రంలో ప్రతి పేద వాడికి ఇంటి స్థలం ఇచ్చి, ఇల్లు నిర్మించేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా, అవి నీటి మూటలు గానే మిగిలిపోతున్నాయి. తల దాచుకునేందుకు జానెడు స్థలం లేక పేదలు అనేక ఇబ్బంది పడుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అలవలపాడు గ్రామంలో జగనన్న కాలనీ నిర్మించేందుకు సర్వే నెంబరు 370లో ఉన్న చుక్కల భూమి 5 ఎకరాల 22 సెంట్లు ఇళ్ల స్థలాలుగా ఇచ్చేందుకు అధికారులు మంజూరు చేశారు. గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల్లో ఉన్న పేదలను గుర్తించి, 117 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఒకటిన్నర సెంటు లెక్కన, ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఇందులోనే రైతు భరోసా కేంద్రం, గోడౌను నిర్మించేందుకు కూడా స్థలాన్ని కేటాయించారు. ఈ స్థలంలో పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు అనుకూలంగా, సుమారు 16 లక్షల రూపాయల ఉపాధి హామీ పథకం నిధులతో మెరక తోలి, రోడ్లు వేశారు. సైడ్ కాలువలు కూడా నిర్మించారు. తాగు నీటి వసతి కల్పించేందుకు బోర్లు కూడా వేశారు. కాలనీ వరకు విద్యుత్తు లైను కూడా లాగారు. ఇక్కడ జగనన్న ఇళ్లను నిర్మించుకునేందుకు గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో, శిలాఫలకం వేసి శంకుస్థాపన కూడా నిర్వహించారు. అయితే ఈ స్థలాలు తమకు అక్కరలేదని, ఈ స్థలాల్లో ఇల్లు నిర్మించుకోవటం తమ వల్ల కాదని, లబ్ధిదారులు కరాఖం డిగా అధికారులకు చెప్పేశారు. ఈ నేల పూర్తిగా సౌడు నేల అవటం వలన, కింద బంక మట్టి ఉందని, ఇక్కడ ఇల్లు నిర్మించుకుంటే కిందకు కుంగిపోతాయని, పైగా గ్రామానికి చాలా దూరంగా ఉందని, చుట్టూ తుమ్మ చెట్లు అడవిని తలపించే విధంగా ఉన్నాయని, ఈ స్థలాలు మాకు వద్దని లబ్ధిదారులు అధికారులకు చెప్పారు. గృహ నిర్మాణాల కోసం శంకుస్థాపన చేసి రెండు సంవత్సరాలు కావస్తున్నా, ఇంతవరకు అక్కడ ఒక్క ఇంటిని కూడా లబ్ధిదారులు నిర్మించుకోలేదు. దీంతో అధికారులు ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మొదట్లోనే స్థలం పరిస్థితి తెలుసు కొని, లబ్ధిదారుల ద్వారా గ్రామ ప్రజల ద్వారా వివరాలు సేకరించి స్థలం కేటాయించినట్లయితే, ఈ సమస్యలు రావని పలువురు అంటున్నారు. అధికారులు ముందుచూపు లేక, గుడ్డిగా స్థలాన్ని లబ్ధిదారులు కేటాయించి చేతులు దులుపుకోవడం వల్లనే, ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు. ఈ స్థలం సుమారు 50 సంవత్సరాలకు ముందు అలవలపాడు గ్రామంలోని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న 12 మంది పేదలకు ప్రభుత్వం ఇచ్చింది. ప్రస్తుతం అప్పుడు ప్రభుత్వం నుంచి భూమిని తీసుకున్న పేదలు ఎవరూ లేరు. వారి వారసులు మాత్రం ఉన్నారు. అయితే వారసులు కూడా పట్టించుకోకపోవడంతో, ఆ భూమిని గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆటలాడుకు నేందుకు ఆటస్థలంగా కేటాయించారు. అయినా కూడా ఈ స్థలం పాఠశాలకు దూరంగా ఉండటం, అంత అనుకూలంగా లేకపోవడం వలన పాఠశాల విద్యార్థులు కూడా ఈ భూమిని ఉపయోగించుకున్నది లేదు. ప్రస్తుతం ఎవరు ఆధీనంలో లేక, తుమ్మ చెట్లు విపరీతంగా మొలిచి అడవిని తలపించే విధంగా ఉన్న ఈ భూమిని, అధికారులు హడావిడిగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కేటాయించారు. ఇప్పుడు అది బెడిసికొట్టడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. కేవలం అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇది జరిగిందని అంటున్నారు. రాష్ట్రం మొత్తం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వం ఇల్లు కట్టిస్తున్నా తమకు మాత్రం ఆ పరిస్థితి లేదని, అధికారులు కూడా తమను వదిలేశారని, తమను పట్టించుకున్న నాథుడే లేడని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలవలపాడు గ్రామంలో వేసిన జగనన్న కాలనీ లేఅవుట్, గృహ నిర్మాణ శంకుస్థాపనకై వేసిన శిలాఫలకం

అక్కడ ఇల్లు నిర్మిస్తే కుంగిపోతాయి

- షేక్ అంజ సాహెబ్, లబ్ధిదారుడు

ఆ స్థలం ఇల్లు కట్టుకునేందుకు అనుకూలమైంది కాదు. బాగా ఉబ్బలిగా ఉంటుంది. ఇల్లు నిర్మిస్తే కుంగిపోతాయి. ప్రభుత్వం అన్ని చోట్ల లక్షల రూపాయలు పెట్టి భూములు కొని, పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇస్తోంది. కానీ ఇక్కడ మాత్రం అధికారులు పనికిరాని భూమిని పేదలకు అంటగట్టి చేతులు దులుపుకున్నారు.

మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేడు

- షేక్ సుమన్, లబ్ధిదారుడు

పేదలంతా ఆ స్థలం తమకు వద్దని, అక్కడ ఇల్లు నిర్మించుకోలేమని అధికారులకు చెప్పినా కూడా, మరో ప్రత్యామ్నాయం చూడకుండా అధికారులు మౌనంగా ఉండిపోయారు. ఉన్నతాధికారుల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లాం. అయినా మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇళ్ల స్థలాలు లేక పేదలంతా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మంచి భూమిలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

ఎంపిడిఓ కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతులు అధిక మొత్తంలో మొక్కజొన్న పంటను సాగు చెయ్యగా పంట చేతికందే సమయంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి రోజు రోజుకూ ధరను తగ్గిస్తున్న దృష్ట్యా ప్రభుత్వం మార్కెఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు వేములపల్లి వెంకట్రామయ్య, మండల అధ్యక్షులు కె రామస్వామి మాట్లాడుతూ ప్రస్తుతం పంట చేతికందే దశకు చేరుకోగా నిన్న, మొన్నటి వరకు క్వింటా రూ.2,200 ధర ఉండగా నేడు రూ.1,900కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, దీనివలన రైతులు ఎకరాకు రూ.15 వేలకు పైగా నష్టపోవలసి వస్తోందని అన్నారు. పెరిగిన ఖర్చులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ మద్దతు ధర రూ.1,960కి కొనుగోలు చేసే విధంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే వ్యాపారులు ధరలో మరింత కోత విధించి రైతులను దోచుకునే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి సుధాకర్, ఎం సత్యనారాయణ, జి నాగరాజు, దీపాల సత్యనారాయణ, మండవ నాగేశ్వరరావు, వేములపల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

గాజుల్లంక అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి-భట్టిప్రోలు(కొల్లూరు)

కొల్లూరు మండలం గాజుల్లంక గ్రామంలో గల బ్రిటిష్ కాలంనాటి స్వాతంత్ర్యోద్యమ సమయంలో కాంగ్రెస్ గూండాల చేతిలో 1947 ఏప్రిల్10న తూటాలకు బలైన అమరవీరుల స్థూపం వద్ద సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు నివాళులర్పించారు. అమరులైన బావిరెడ్డి వియ్యమ్మ, సనకా సుబ్బారావు, బావిరెడ్డి వెంకటేశ్వర్లు, మత్తె సుబ్బారావు స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ మాట్లాడుతూ చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం పేదలను ఐక్యపర్చి ప్రతి పేద వానికి భూమి కావాలని, కూలి రేట్లు పెంచాలని పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి బావిరెడ్డి వియ్యమ్మ అన్నారు. నేడు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు సిపిఎం, సిపిఐ చేపట్టిన జాతాలు, నిరసన కార్యక్రమాలతో ప్రజలను చైతన్యపర్చి ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. ముఖ్యంగా బిజెపి పాలనలో పెట్టుబడి దారులైన ఆదానీ, అంబానీలకు లక్షల కోట్ల రుణాలు మాఫీ చేయటం వంటి విధానాలను ప్రజలలోకి తీసుకువెళ్లి బిజెపిని గద్దె దించే దిశగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. తొలుత సిపిఎం నాయకులు బావిరెడ్డి సుబ్బారావు స్థూపం వద్ద పూలు చల్లి నివాళులర్పించగా, మాజీ ఎంపిపి అమృతలూరి కృపానందం జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి వెంకట్రామయ్య, బోనిగల సుబ్బారావు, నాగేశ్వరరావు, బుల్లెబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

'వెలిగొండ' నిర్మాణాన్ని పూర్తి చేయాలి

ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

శ్రీపూలసుబ్బయ్య వెలిగొండ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలు, రైతులకు తాగు, సాగు నీరందించాలని రైతు సంఘం పశ్చిమ జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి కోరారు. శ్రీపూలసుబ్బయ్య వెలిగొండ నిర్మాణాన్ని పూర్తిచేయాలని, నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీని విడుదల చేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసి సెప్టెంబర్ 2023 నాటికి నీరు అందిస్తామని పాలకులు పదే పదే హామీ ఇస్తున్నట్లు తెలిపారు. పాజెక్టు నిర్మాణంలో పురోగతి కనిపించటం లేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో ముంపుగురికానున్న 11 గ్రామాలకు చెందిన 7,200 మంది నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి నిధులు విడుదల చేయాలన్నారు. కటాఫ్ తేదీను నీళ్ళు ఇచ్చే వరకూ పొడిగించే విధంగా నూతన జీవోను విడుదల చేయాలన్నారు. ఈ నెల 12న మార్కాపురం పర్యటన వస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై హామీ ఇవ్వాలన్నారు. లేకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కాన్వాయిని అడ్డుకునేందుకు వెనకాడబోమని హెచ్చరించారు. అనంతరం ఉప కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, నిర్వాసిత గ్రామాల ప్రజలు ఆర్.శ్రీనివాసులు, మల్లికార్జున, జె.సుబ్బయ్య, షేక్ కాశిం సాహెబ్, పోరెడ్డి రంగారెడ్డి, బి.రామిరెడ్డి, వల్లెల రంగారెడ్డి, ఎన్. రమణరెడ్డి, కెవిపిఎస్ నాయకుడు పి.రూబెన్ తదితరులు పాల్గొన్నారు.


ఉప కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి- కొత్తపట్నం

ఉపాధి హామీ చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన స్టాఫ్‌వేర్‌తో కూలీలకు తీవ్రమైన అన్యాయం జరుగు తుందని, దాన్ని సవరించి పాత పద్ధతిలోనే పనులు కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. కొత్తపట్నం మండలం అల్లూరు పంచాయతీ పరిధిలోని శ్రీహరిపురం వద్ద నిర్వహిస్తున్న ఉపాధి హామీలను సోమవారం ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక మార్పులతో తమకు తీవ్ర నష్టం జరుగుతుందని తమ పొట్ట కొట్టొద్దని తక్షణమే పాత సాఫ్ట్వేర్ పద్ధతిలో పని కొనసాగించాలని కూలీలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పాత స్టాఫ్‌వేర్ ప్రకారం కూలీలకు రోజువారీ వేతనం గత నెల వరకు రూ.257 వచ్చినట్లు తెలిపారు. రెండు రోజులు పని చేస్తే 257 వస్తే ఒకరోజుగా లెక్కించి మరొక రోజు వారికి పని దినం కల్పించేవారని తెలిపారు. నూతన స్టాఫ్‌వేర్ ప్రకారం ఈనెల కనీస వేతనం రూ.272 అని తెలిపారు. అందులో రూ.100 రూపాయలు పనిచేసినా, రూ.150 రూపాయల పని చేసిన ఒక పని దినం పూర్తిగా అయిపోతుంది. వేతనం తగ్గు తుందన్నారు. పని దినాలు కూడా తగ్గుతాయని తెలిపారు. ప్రస్తుతం వర్క్ ఐడి ప్రాతిపదికన మస్టర్ వేసుకుంటున్నారని, ఇందులో గ్రూపులతో సంబంధం లేకుండా వందలాదిమంది పనిచేస్తారని, ఫలితంగా పని చేసిన వారికి సరిగా చేయని వారికి ఒకే తరహా వేతనం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు కండే గోవింద్, ఎ.ఈతముక్కల, ఎన్. వెంకటేష్, జి.మోహన్రావు, ఎడ్లూరి కోటయ్య, మైలవరపు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

మార్కాపురంలో ట్రాఫిక్ ఆంక్షలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ఈనెల 12న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో మార్కాపురంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు డిఎస్‌పి డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గిద్దలూరు, కంభం వైపు నుంచి వచ్చే వాహనాలు దేవరాజుగట్టు మీదుగా, మార్కెట్ యార్డ్ జంక్షన్ వెళ్లి భారత్ పెట్రోల్ బాంక్ వద్ద కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. తర్లుపాడు వైపు నుంచి వచ్చే వాహనాలు కోర్టు సెంటర్ , ఎస్టేట్ వై.జంక్షన్, మార్కెట్ యార్డు మీదుగా వచ్చి ఎస్‌వికెపి కళాశాల వద్ద పార్కింగ్ చేయాలన్నారు. విఐపి పాస్ కలిగిన వారు తమ యొక్క వాహనాలను ఎస్‌వికెపి కళాశాల ఎదురుగా విఐపి పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. విఐపి పార్కింగ్-2 పాస్‌లు కలిగిన విజేత బార్ అండ్ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను వరుస క్రమంలో నిలపాలన్నారు. ద్విచక్ర వాహనాలపై పై మీటింగ్ కు వచ్చే ప్రజలు సౌజన్య ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న దాల్/రైస్ మిల్లులో ఏర్పాటు చేసిన స్థలంలో పార్కింగ్ చేసు కోవాలన్నారు.

ఇతర వాహనాలకు ఇలా...

గిద్దలూరు, కంభం వైపు నుంచి మార్కాపురంటౌన్ లోకి వచ్చే బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, పెద్ద ఆటోలు, ఇతర వాహనాలు దేవరాజు గట్టు మీదుగా, ఎస్టేట్, వై.జంక్షన్, కోర్టు సెంటర్ మీదుగా టౌన్ లోనికి ప్రవేశించాలన్నారు. గుంటూరు, యర్రగొండపాలెం, దోర్నాల వైపు నుంచి మార్కాపురం టౌన్ లోనికి వచ్చే బస్సులు, లారీలు, ట్రాక్టర్లు, పెద్ద ఆటోలు మరియు ఇతర వాహనాలు దేవరాజుగట్టు మీదుగా, ఎస్టేట్, వై. జంక్షన్ గుండా, కోర్టు సెంటర్ మీదుగా టౌన్ లోనికి ప్రవేశించాలన్నారు. ట్రాఫిక్ అంశాలు ఈనెల 12న ఉదయం 6.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకూ అమలు ఉంటాయని డిఎస్‌పి తెలిపారు.

స్పీడ్ బోటు ఏదీ..!

- నిధులు మంజూరైనా కానరాని బోటు

- కడలూరు బోట్ల కట్టకి ఇక్కట్లు

ప్రజాశక్తి -శింగరాయకొండ

సముద్రంలోని మత్స్య సంపదను దోచుకుపోతున్న తమిళనాడు రాష్ట్రంలోని కడలూరు బోట్లను నిలుపుదల చేసేందుకు స్పీడ్ బోటు కొనుగోలు కోసం గతంలో జిల్లా పరిషత్ నుంచి రూ. 13 లక్షలు మంజూరు చేశారు. ఆ నిధులు ఏమయ్యాయో ఏమో ఇంత వరకూ స్పీడ్ బోటు కొనుగోలు చేయలేదని మత్స్యకారులు చెబుతున్నారు. కడలూరు బోట్లను కట్టడి చేయాలంటే మత్స్యశాఖ అధికారులకు. మెరైన్ పోలీసులకు స్పీడ్ బోటు అవసరం. స్పీడ్ బోటు లేని కారనంగా కడలూరు బోట్లు ఈ ప్రాంతానికి వచ్చి సముద్రంలో వేట కొనసాగిస్తున్నాయి. కడలూరు బోట్లు వచ్చినట్లుగా పత్రికల్లో వార్తలు వస్తేనే అధికారులు కదులుతున్నారని, మిగతా సమయంలో పట్టించుకోవడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. కడలూరు బోట్లకు కట్టడి చేసేందుకు గతంలో చెన్నైలో తీర ప్రాంత అధికారులు, మంత్రులతో సమావేశాలు నిర్వహించారు. ఆ సమావేశంలో మన రాష్ట్ర మంత్రి పాల్గొని కడలూరు బోట్ల వల్ల కలుగుతున్న సమస్యల గురించి వివరించారు. దీంతో కొంత కాలం పాటు కడలూరు బోట్లు తీరానికి దూరంగా వేటసాగించాయి. నిబంధనల ప్రకారం తీరానికి 8 కిలోమీటర్ల దూరంగా కడలూరు బోట్లు వేట సాగించాల్సిఉంది. అయితే తీరానికి అతి సమీపంలోకి వచ్చి వేటసాగిస్తున్నారు. దీంతో తమ వలలు దెబ్బతింటున్నట్లు స్థానిక మత్స్యకారులు దెబ్బతింటున్నాయి. కడలూరు బోట్లు కారణంగా తమకు వేట కూడా సాగడం లేదని వారు చెబుతున్నారు. గత రెండు రోజులుగా పాకల, ఊళ్ల పాలెం, బింగినపల్లి ప్రాంతాల్లోని తీరం వెంబడి కడలూరు బోట్లు వేటసాగిస్తున్నాయి. దీంతో స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. స్పీడ్ బోటు లేని కారణంగా కడలూరు బోట్లను అదుపు చేయలేక పోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్పీడ్ బోటును కొనుగోలు చేసి కడలూరు బోట్లను కట్టడి చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

తీరంలో వేటాడుతున్న కడలూరు బోట్లు

పూజలు నిర్వహిస్తున్న వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

బూచేపల్లి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-కురిచేడు

మండల పరిధిలోని దేకనకొండ గ్రామంలోనున్న శ్రీలక్ష్మీ నరసింహ దేవస్థానంలోమండలాభిషేక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయ్య , దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు. స్వామి వారి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురిచేడు జడ్‌పిటిసి నుసుం వెంకటనాగిరెడ్డి, మాజీ ఎంపిపి వీరగంధం కోటయ్య, నమశ్శివాయపురం నాయకులు పాతకోట వెంకటరెడ్డి, గ్రామ సర్పంచి, తహశీల్దారు షేక్ నాగుల్ మీరా, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వసంతరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

రూ.30 వేల ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -గిద్దలూరు రూరల్

మండల పరిధిలోని జయరాంపురం గ్రామానికి చెందిన ఎఎస్ఐ జె.కాశయ్య స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. కాశయ్యకు సోమవారం సన్మాన సభ నిర్వహిం చారు. ఈ సందర్భంగా కష్ణం శెట్టిపల్లె గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని మచ్చ సింధూకు గిద్దలూరు వివేకానంద కాలేజీ 1983 -88 విద్యాసంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థులు రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. సింధూ హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజిలో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతోంది. చదువు కొనసాగించేందుకు ఆర్థిక ఇబ్బందులకు గురవుతుంది. ఈ విషయం గురించి తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. సింధూ మెడిషన్ పూర్తి చేసేవరకు అయ్యే ఖర్చును తామే భరిస్తామని పూర్వవిద్యార్థులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హనుమంత రెడ్డి, తులసి బాబు,సుబ్బరాయుడు ,ప్రసాదు ,వలి, కంచమనేని రంగస్వామి రెడ్డి , మోహన్, వీరయ్య, కొండలరావు ,కాశయ్య, ఎస్ఐ పిచ్చిరెడ్డి ,రంగస్వామి రెడ్డి ,ఎగటీల రంగస్వామి, రమణయ్య, అలసందల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు .

ఉచిత రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో మార్కాపురం జిల్లా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటిండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానం అనే దృక్పదంతో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి మరొకరి ప్రాణం కాపాడాలని తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పండ్లు, జ్యూస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్టు చైర్మ విజయ్ కుమార్, ట్రస్టీ నిరిక్షణమ్మ, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దిలీప్ యాదవ్, హెడ్ సిస్టర్ ఫ్లోరెన్సిస్, ఐసిటిసి కౌన్సిలర్ శ్రీనివాసరావు, బ్లస్ స్టోరేజి సిబ్బంది లక్ష్మి, సోషల్ వర్కర్ తిరుమలయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుబ్బయ్యకు సతీవియోగం

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు గ్రామానికి చెందిన మద్దాళి సుబ్బయ్య పంతులుకు సతీవియోగం కలిగింది. ఆయన సతీమణి లక్ష్మి నిరోషా గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. లక్ష్మి నిరోషా మృతదేహాన్ని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కెజి.మస్తాన్, సిపిఎం కందుకూరు మండల కార్యదర్శి ఎస్‌కె.గౌస్‌బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్, అంగన్‌వాడీ యూనియన్ మండల అధ్యక్షురాలు మధురవాణి, చప్పిడి లక్ష్మీనరసింహం సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు.

నూతన కమిటీ ఎన్నిక

యర్రగొండపాలెం : స్థానిక టిడిపి కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల తెలుగు రైతు సంఘం అధ్యక్షుడిగా పోక వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా బొడ్డు పెద్ద అంజిరెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శిగా బోడ చిన్న వీరయ్య, అధికార ప్రతినిధిగా నీలం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, షేక్ ఇస్మాయిల్, బోడా చిన్న వీరయ్య, షేక్ చిన్నవలి, గురిజేపల్లి జిలాని, కంచర్ల సత్యనారాయణ గౌడ్, కిశోర్, మంత్రూ నాయక్, రమణమ్మ, సుబ్బారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

కొనకనమిట్ల : మహిళలు అన్ని రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పంచాయతీ కార్యదర్శి కె.రాజకుమారి తెలిపారు. స్థానిక ఎస్‌సి కాలనీలో అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజకుమారి మాట్లాడుతూ యువతులు స్వయం కృషితో అభివృద్ధి చెందినప్పుడే భద్రత, భరోసా ఉంటుందన్నారు. అసిస్ట్ సంస్థ పోగ్రాం అధికారి పి.లీలావతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద మహిళలు స్వశక్తిగా జీవించే విధంగా తయారు చేయాలనే ఉద్దేశ్యంతో ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.కృష్ణారెడ్డి, సిఒలు జి.రమణయ్య, పి.శ్రీను, శిక్షకురాలు పి.బాలఅంకమ్మ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నీటి కోసం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీళ్ల తోలినప్పటికీ సరిపోవడం లేదు. బోరును ఏర్పాటు చేసి నీటి సమస్యను తీర్చాలని కాలనీ వాసులు ఇటీవల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌ను కోరారు. స్పందించిన మంత్రి సురేష్ సోమవారం తన సొంత నిధులతో మంచిబోరు ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులను ఆదేశించారు. దీంతో స్థానిక నాయకులు యుద్ధప్రాతిపదిన మంచినీటి బోరు వేయించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తి రెడ్డి, ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, సర్పంచి రామవత్ అరుణ బాయి, వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్ రెడ్డి, నాయకులు నర్రెడ్డి వెంకటరెడ్డి, దగ్గుల కాశిరెడ్డి పాల్గొన్నారు.

నెలాఖరులోపు పన్నులు చెల్లిస్తే ఐదుశాతం రాయితీ : మేయర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్థిపన్ను, ఖాళీ స్థలాల పన్ను ఏక మొత్తంలో చెల్లించిన వారికి నెలాఖరు వరకు ప్రభుత్వం ఐదుశాతం రాయితీ ఇస్తున్నట్లు నగర మేయర్ గంగాడ సుజాత తెలిపారు. నెలాఖరులోపు పన్నులు చెల్లించిన వారికి రాయితీ వర్తిస్తుందన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని పన్నులు చెల్లింపు కేంద్రాన్ని సోమవారం మేయర్ పరిశీలించారు. పన్నులు చెల్లించేందుకు కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చేవారికి వీలుగా కౌంట్లను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన ఐదుశాతం రాయితీ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేయర్ కోరారు. మేయర్ వెంట రెవెన్యూ ఆఫీసర్ -2 భాస్కర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

టిడిపి ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు, నిరసనలు

ప్రజాశక్తి-మార్కాపురం

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ టిడిపి నాయకులు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్కలగడ్డ మల్లికార్జునరావు, తాళ్లపల్లి వెంకట సత్యనారాయణలు మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచనని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ ఇప్పటివరకు ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని ఆరోపించారు. ఇప్పుడు రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించడానికి కంకణం కట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **హనుమంతునిపాడు :** పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని మాట ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.50 వేల కోట్ల భారం మోపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డం తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, గాయం తిరుపతిరెడ్డి, మువ్వా రంగసాయి, కోటపాటి పెద్దశేషయ్య తదితరులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ టిడిపి నాయకులు స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఎఇ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, షేక్ ఇస్మాయిల్, బోడా చిన్న వీరయ్య, షేక్ చిన్నవలి, గురిజేపల్లి జిలాని, కంచర్ల సత్యనారాయణ గౌడ్, కిశోర్, మంత్రూ నాయక్, రమణమ్మ, సుబ్బారావు, శ్రీనివాస్, సేవ్యా నాయక్ పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ టిడిపి నాయకులు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం

దోర్నాలలో ధర్నా నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు భట్టు సుధాకర్‌రెడ్డి, షేక్ మాబు, జడి లక్ష్మయ్య, ఈదర మల్లయ్య, దొడ్డా శేషాద్రి, విష్ణు వర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. **దర్శి :** పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించేంత వరకూ పోరాటం చేస్తామని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు తెలిపారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో 8సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, తెలుగు మహిళ అధికార ప్రతినిధి శోభారాణి, నాయకులు సంగా తిరుపతిరావు, మారెళ్ళ వెంకటేశ్వర్లు, స్టీవెన్, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, కోటయ్య, సుబ్బారావు, మధు, జూపల్లి కోటేశ్వరరావు, రమణారెడ్డి, రామక్రిష్ణ, సతీష్, రంగారావు, రామారావు పాల్గొన్నారు. **తాళ్లూరు :** పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గంగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, నాయకులు మానం రమేష్, కొండారెడ్డి, వెంకట్రావు, రమేష్, సాగర్, వేణు, శ్రీనివాసరెడ్డి, చంద్ర పాల్గొన్నారు. **పామూరు :** పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఎఇకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పువ్వాడ వెంకటేశ్వర్లు, రైతు నాయకులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **పెద్దారవీడు :** పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచినట్లు తెలిపారు. టిడిపి మండల మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బింగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం ఇన్‌ఛార్జి విద్యుత్ ఎఇ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షుడు దొడ్డా భాస్కర్‌రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి గుమ్మా గంగరాజు, మాజీ జెడ్‌పిటిసి జడ్డా రవి, ఎంపిటిసి దండా వెంకటేశ్వం రెడ్డి, యర్రగొండ పాలెం నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు లింగాల అబ్రహం, టిడిపి నాయకులు దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెన్నా బోడిరెడ్డి, కంచర్ల తిరుపాలు, గొట్టం రామనారాయణరెడ్డి, దుగ్గెం దానియేలు, దొడ్డా నాసర్‌రెడ్డి, నరాల వెంకట నారాయణ, పాముల పోలురాజు, వెంకట నారాయణరెడ్డి పాల్గొన్నారు. **వెలిగండ్ల :** పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బింగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి

మార్కాపురంలో ధర్నా నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కర్ణాటి భాస్కర్‌రెడ్డి, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.మౌలాలి, మండల నాయకులు కొండూ భాస్కర్‌రెడ్డి, కీసరి రమణా రెడ్డి, సందడి మస్తాన్‌రెడ్డి, గుంటక జయరామిరెడ్డి, పల్నాటి బాలకోటయ్య, సోభిరాల వేణుగోపాల్ పాల్గొన్నారు. **జరుగుమల్లి :** పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి మండల కన్వీనరు పోకూరి రవీంద్రబాబు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బింగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి

జరుగుమల్లిలో ధర్నా నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కొండపి నియోజకవర్గకార్య నిర్వాహక కార్యదర్శి బత్తిన పూర్ణ, తెలుగు రైతు ఉపాధ్యక్షుడు పెదబాబు, టిడిపి నాయకులు నరాల సోమయ్య, బలరామిరెడ్డి, కొమ్మాలపాటి కృష్ణ, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, స్వర్ణ రవీంద్ర పాల్గొన్నారు. **అర్ధవీడు :** విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ మండల పరిధిలోని నాగులవరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కొనతం రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టిన తర్వాత 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు. పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడుసార్లు విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై తీవ్రమైన భారాలను మోపినట్లు టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు తెలిపారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం హిందూజా కంపెనీకి విద్యుత్ సంస్థను ధారాదత్తం చేస్తున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శినరసింహారావు , గ్రామ కమిటీ అధ్యక్షుడు శంకర్ , మాజీ ఎంపిపి గోవిందయ్య, మాజీ జడ్‌పిటిసి తన్నీరు శ్రీనివాసరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ముప్పరాజు శ్రీనివాసరావు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు మాధవీలత, నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, ఎం శీనివాసరావు పాల్గొన్నారు.

హనుమంతునిపాడులో ధర్నా నిర్వహిస్తున్ననాయకులు

పెద్దారవీడులో ధర్నా నిర్వహిస్తున్ననాయకులు

దర్శిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుపై టిడిపి నిరసన

ప్రజాశక్తి-బాపట్ల

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై పెనుభారం మోపుతూ విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో బాపట్ల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మూడేళ్ల కాలంలోనే విద్యుత్ టారిఫ్ కుదింపు, శ్లాబుల మార్పు, ఫిక్స్‌డ్ ఛార్జీ, అదనపు డిపాజిట్ల రూపంలో 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై రూ.17 వేల 93 కోట్లు ప్రజలపై ప్రభుత్వం పెనుభారం మోపిందన్నారు. రాష్ట్ర విభజన తరువాత విద్యుత్ లోటుతో ఉన్న రాష్ట్రాన్ని తన విజన్, పరిపాలన దక్షతతో నారా చంద్రబాబు నాయుడు మిగులు విద్యుత్ రాష్ట్రంగా తీర్చిదిద్ది పక్క రాష్ట్రాలకు విద్యుత్ అమ్ముకునే పరిస్థితికి తెచ్చారు. ఐదేళ్ల పాలనలో ఒక్కసారి కూడా విద్యుత్ చార్జీలు పెంచకుండా, అసలు కరెంటు కోతలు లేకుండా సరఫరా చేసిన ఘనత టీడీపీదేనన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇప్పటివరకు వివిధ రూపాల్లో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించి ప్రజలకు విద్యుత్ చార్జీల భారం తగ్గించాలని నరేంద్రవర్మ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, గొల్లపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, ఏపూరి భూపతిరావు, తానికొండ దయాబాబు, పమిడి బాస్కరరావు, మానం విజేత, జిట్టా ప్రమీలా రాణి, తోట నారాయణ, కావూరి శ్రీనివాసరెడ్డి, పరిశా రమేష్, మానం శ్రీనివాసరావు, పల్లం సరోజిని, జీవన్, మరీదు వెంకటేశ్వర్లు, నక్కల వెంకటస్వామి, తాతా చిన్న బాబు, వేమవరపు విజయ్, బూర్లె

పంగులూరులో విద్యుత్ సబ్ స్టేషన్ ముందు టిడిపి నిరసన

రామసుబ్బారావు, దుర్గ ప్రసాద్, ఉమారెడ్డి వెంకటేష్ నాయుడు, రాంబాబు, కందుల బాల కోటేశ్వరరావు, సురగాని శేఖర్, గుడిపల్లి సాంబశివరావు, వీరయ్య నాయుడు, గుంపుల కన్నయ్య, కొల్లూరి వెంకట్రావు, నల్లమల్ల నాగేశ్వరరావు, నాగరాజు, చార్లెస్, కష్ణ గౌడ్, మస్తాన్ వలి, ఫరీద్ మస్తాన్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి: విద్యుత్ ఛార్జీలను పెంచడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ అద్దంకి పట్టణ, మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయలో గ్రామీణ విద్యుత్ శాఖ వద్ద నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇష్టారీతిన ఎడాపెడా పెంచుతున్న విద్యుత్ ఛార్జీలపై వైసిపి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నినదించారు. పెంచిన ట్రూఅప్, స్లాబ్ మార్పు, టారిఫ్‌ల కుదింపుపై వెంటనే వెనక్కి తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండల కేంద్రమైన యద్దనపూడి గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సోమవారం టిడిపి నాయకులు రాష్ట్రంలో పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసన తెలిపి విధ్యుత్ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సామాన్య ప్రజలపై అధిక భారాలు మోపుతోందని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో మాజీ సర్పంచులు బి సాంబయ్య, వజ్జా సుబ్బరామయ్య, మండల నాయకులు తారక, వెంకటరావు, రాము, వీరయ్య, నాగేశ్వరరావు, ఆ

అద్దంకిలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద టిడిపి నిరసన

పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతమాగులూరు: పెంచిన విద్యుత్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాడిపర్తి వెంకటరావు ఆధ్వర్యంలో, నాయకులు, కార్యకర్తలు గంటపాటు రాస్తారోకో, తమ నిరసనను వ్యక్తం చేశారు. దీంతో జంక్షన్‌లో వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, రామకృష్ణ, కొనికి శ్రీనివాసరావు, సింబోతుల వీరయ్య, నంబుల కొండలు, అనంతవరపు దేవా, గొట్టిపాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని టిడిపి నాయకులు ఆందోళన చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా ఇసుకపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. సైకో పోవాలి సైకిల్ రావాలని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ట్రూ అప్ చార్జీల పేరుతో దోపిడీ చేస్తున్నారని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు జీవి నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ యూనిట్లతో సంభందం లేకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ బిల్లులను సంక్షేమ పథకాలకు లింక్ పెట్టి తెల్లరేషన్ కార్డులను నిలిపివేయటం, సంక్షేమ పథకాలలో కోతలు విదిచటం చేస్తున్నారని ఆరోపించారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాలలో ఏడుసార్లు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపైన పెనుభారం మోపిందని విమర్శించారు. వ్యవసాయం చేసుకునే రైతుల పొలాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చెయ్యటాన్ని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలను భారీగా పెంచటంతో పాటు ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపైన రూ.57 వేల కోట్లు భారం మోపటం దారుణం అన్నారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం తగ్గించకుంటే విద్యుత్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పట్టణ అధ్యక్షులు పట్టాభి రామారావు, రూరల్ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, అన్నే రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు (వేమూరు): వైసీపీ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా సోమవారం టిడిపి ఆధ్వర్యంలో వేమూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. నియోజక పరిధిలో ప్రజలు, రైతులు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ మంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తన సొంత ప్రయోజనాల కోసం విద్యుత్ చార్జీలు పెంచుకుంటూ పోతున్నారని ఆరోపించారు. రూ.57 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపిన జగన్మోహన్‌రెడ్డిని ఎందుకు నమ్మాలని ప్రశ్నించారు. మోటర్లకు మీటర్లు బిగించి రైతులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 ఏప్రిల్ నుంచి యూనిట్‌కు 40 పైసలు పెంచి ప్రజలపై భారాన్ని మోపిన ముఖ్యమంత్రి స్టిక్కర్ ముఖ్యమంత్రిగా పెరుగాంచాడని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో అధికారికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

పంగులూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ పంగులూరులోని విద్యుత్తు సబ్ స్టేషన్ ముందు తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు కుక్కపల్లి ఏడుకొండలు మాట్లాడుతూ, గత నాలుగు సంవత్సరాలుగా విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి రాష్ట్ర ప్రజలను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దోపిడీ చేస్తోందని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ యూనిట్‌తో సంబంధం లేకుండా, ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసినట్లు వారు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ బిల్లులను, సంక్షేమ పథకాలకు లింకు చేసి, తెల్ల రేషన్ కార్డులను నిలిపి వేయటం, సంక్షేమ పథకాలలో కోతలు విధిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు భారీగా పెంచడంతో పాటు, ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజలపైన 57 వేల కోట్లు భారం మోపటం దారుణమని ఏడుకొండలు అన్నారు. ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల భారం తగ్గించకుంటే విద్యుత్ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని రావూరి రమేష్ అన్నారు. జగనే మా నమ్మకం అనే స్టిక్కర్లు ఇంటింటికీ అంటిస్తూ, ప్రజలను మర్చిపోయారని, వీరి పట్ల ఎవరికీ నమ్మకం లేదని అన్నారు. అనంతరం వినతిపత్రాన్ని విద్యుత్ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు జాగర్లమూడి పూర్ణచంద్రరావు, కస్యాపురం గ్రామ తెలుగుదేశం అధ్యక్షుడు దూళిపాళ్ల రాజేష్, రేణింగవరం మాజీ సర్పంచ్ అమర్తపూడి ఏసోబు(చిన్న), పార్టీ నాయకులు మానం రమేష్ బాబు, కోమటి ప్రసాదు, ఆరికట్ల వారి పాలెం మాజీ సర్పంచ్ ఉన్నం రవికుమార్, మాజీ నీటి సంఘం అధ్యక్షులు అల్లమనేని బ్రహ్మానంద స్వామి, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు వలపర్ల సుబ్బారావు, తెలగతోటి రాధాకృష్ణ, మేడ సుబ్బారావు, వెంకటేశ్వర్లు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ రూరల్: పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సోమవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కె ఇజ్రాయిల్, తెలుగు యువత నాయకుడు ధూళిపాళ్ల హనుమంతరావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలపై ప్రభుత్వం వివిధ రూపాల్లో అనేక భారాలు మోపుతూ పేద ప్రజల నడ్డి విరిచారని వారు విమర్శించారు. అది చాలదన్నట్టు విద్యుత్ బిల్లుల పేరుతో అదనపు భారాన్ని మోపుతోందని, విద్యుత్ వినియోగంతో సంబంధం లేకుండా రకరకాల చార్జీల పేరుతో ప్రజలను దోచుకుంటున్నారని వారు మండిపడ్డారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో అనేకసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి 57 వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై వేశారన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. మండల ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ సుబ్బారావు, గుంటుపల్లి ఎంపీటీసీ దూళిపాల శ్రావణి పున్నారావు, అంబడిపూడి మాజీ సర్పంచ్ మందలపు సుధాకర్, బల్లికురవ మాజీ సర్పంచి తన్నీరు వీరాంజనేయులు, కొణిదెన గ్రామం మాజీ సర్పంచ్ చెరుకూరి ఆంజనేయులు, దద్దల అంజయ్య, గొట్టిపాటి లక్ష్మయ్య, వేల్పుల దానయ్య, పావులూరి ఏడుకొండలు, ధూళిపాళ్ల వీరాంజనేయులు, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్ జంక్షన్‌లో రాస్తారోకో

రేపల్లె పట్టణంలోని ఇసుకపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు

వేమూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

వైద్యశిబిరంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

ఉచితంగా వైద్య సేవలు

ప్రజాశక్తి-రేపల్లె

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం రెండు గంటల వరకు విజయవాడలో ప్రతిష్ఠాత్మక అను మై బేబీ కేర్ హాస్పటల్ వారి నిర్వహణలో ఉచితంగా తల్లీ బిడ్డల వైద్య శిబిరం డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అధ్యక్షతన జరిగింది. ఈ శిబిరాన్ని ప్రభుత్వ రేపల్లె కమ్యూనిటీ వైద్యశాల అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ వి పూర్ణానంద్ ప్రారంభిచారు. శిబిరంలో స్పెషలిస్టులైన వ్యాధి నిపుణులు స్త్రీల వ్యాధి నిపుణులు, చిన్న పిల్లల వైద్య నిపుణులు పరీక్షలు చేసి అవసరమైనవారికి స్కానింగ్ డాప్లర్ స్టడీ చేసి సలహా సంప్రదింపులతో పాటు ఉచితంగా మందులు ఇచ్చి గర్భిణులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం గర్భిణులకు పిల్లలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా అను మై బేబీ కేర్ విజయవాడ హాస్పిటల్ వారు రేపల్లె ప్రాంత ప్రజానీకానికి మంచి అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. అనంతరం రేపల్లె సత్య సాయి సేవా సమితి వారు ఈ శిబిరంలో పాల్గొన్న మహిళలందరికీ ఉచితంగా పళ్లు, రొట్టెలు, బిస్కెట్లు కలిగిన ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది గర్భిణులు అను హాస్పిటల్స్‌కు చెందిన పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ బాషా, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ మణి, మార్కెటింగ్ మేనేజర్ కె అనిల్ కుమార్, స్థానిక రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ సీనియర్ సభ్యులు మాదాల మోహన్‌లాల్ సక్సేనా, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ సభ్యులు అడుసుమల్లి ప్రభాకర్‌రావు, ప్రభుత్వ వైద్యశాల డాక్టర్లు, సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పండ్ల మొక్కలు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండలంలో ఉపాధి హామీ పథకంలో సన్న, చిన్నకారు, 5 ఎకరాల లోపు పొలం కలిగిన రైతులకు 100 శాతం సబ్సిడీతో ఉచితంగా పండ్ల తోట మొక్కలు ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. పండ్ల తోట రకం: 1. నిమ్మ 2. మామిడి 3. సపోటా 4. బత్తాయి 5. కొబ్బరి మొక్కలు 6. డ్రాగన్ ఫ్రూట్ 7. తైవాన్ జామ 8. జామ 9. గులాబీ 10. మల్లె 11. సీతాఫలం 12. యాపిల్ బేర్ 13. దానిమ్మ 14. నేరేడు 15. మునగ ఈ రకాల మొక్కలు ఇవ్వబడతాయని, సాగు చేసే రైతులు సమాచారం కోసం ఎంపిడిఓ గారు లేదా ఏపిఓ లేదా గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్లు వద్ద రైతులు నమోదు చేసుకోవాలని ఏపీఓ నాయక్ తెలిపారు.

వైఎస్సార్ రైతు భరోసా రాని రైతులకు గ్రీవెన్స్

ప్రజాశక్తి-పంగులూరు

కొత్తగా పాస్ పుస్తకం వచ్చి వైఎస్సార్ రైతు భరోసా ఇంతవరకు రాని రైతులు, గ్రీవెన్స్‌కు పెట్టుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలం పాస్ పుస్తకం కొత్తగా వచ్చినవారు, ఆధార్ నెంబరు మీ భూమిలో లింక్ అయిందో లేదో చెక్ చేసుకొని రావాలని సుబ్బారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా రాని రైతులు మాత్రమే రావాలని చెప్పారు. పొలం పాస్ బుక్ జిరాక్స్, వన్ బి జిరాక్స్, ఆధార్, బ్యాంక్ అకౌంట్ బుక్స్ జిరాక్స్ కాపీలతో ఆయా గ్రామాల రైతులు రైతు భరోసా కేంద్రాలకు వచ్చి గ్రీవెన్స్‌లో పాల్గొనాలని చెప్పారు. ఇంతవరకు రైతు భరోసా రాని వారికి మాత్రమే ఇది ఉపయోగపడుతుందని, అర్హులైన వారందరూ వీలైనంత త్వరగా పేర్లను గ్రీవెన్స్ నమోదు చేయించుకోవాలని సుబ్బారెడ్డి కోరారు.

'వరికూటి'ని ఇన్‌ఛార్జిగా తొలగించాలి

తాడేపల్లిని తాకిన 'కొండపి వైసిపి' నిరసన సెగ

ప్రజాశక్తి-టంగుటూరు

వరికూటి అశోక్‌బాబును వైసిపి కొండపి ఇన్‌ఛార్జిగా తొలగించాలంటూ వైసిపిలోని మరో గ్రూపు సోమవారం తాడేపల్లికి చేరింది. కొండపి నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులు కొందరు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం వద్ద 'తెలుసుకో జగనన్న'.. 'అశోక్‌బాబు మాకొద్దు' అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేకి కోవర్టుగా అశోక్ బాబు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిరసన తెలిపే వారితో మాట్లాడేందుకు బయటకు వచ్చిన కార్యాలయ ఇన్చార్జి లేళ్ల అప్పిరెడ్డితో వైసిపి నాయకులు వాదనకు దిగారు. అశోక్ బాబును తొలగిస్తున్నట్లు హామీ ఇస్తేనే గానీ ఇక్కడ నుండి కదలబోమని భీష్మించారు. గతంలో ఇదే ఇన్చార్జి వైసిపి జెండాను సైతం నియోజకవర్గంలో నడిరోడ్డుపై తగలబెట్టారని, అలాంటి వ్యక్తిని ఇన్చార్జిగా నియమిస్తే పార్టీనే నమ్ముకుని ఉన్న తమ లాంటి వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వైసిపి కేంద్ర కార్యాలయం ఇన్చార్జి అప్పిరెడ్డి నాయకుల వాదనలు అన్నీ నమోదు చేసుకొని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీతో నియోజకవర్గంలోని ఓ గ్రూపు వైసిపి నాయకులు తాడేపల్లి నుండి వెనుదిరిగారు.

విధుల నుంచి

ముగ్గురు అటవీ సిబ్బంది తొలగింపు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం అటవీ శాఖ పరిధిలోని నరజాముల తాండా వద్ద ఉన్న చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న ముగ్గురిని విధుల నుంచి తొలగించినట్లు యర్రగొండపాలెం అటవీ క్షేత్రాధికారి నీలకంఠేశ్వరరెడ్డి, డిప్యూటీ రేంజర్ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. నాగేశ్వరరావు నాయక్, ఇస్మాయిల్, రామాంజనేయులునాయక్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.400 వసూలు చేయాల్సి ఉండగా రూ.1000 చొప్పున వసూలు చేస్తుండటంతో విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. వీరిపై పోలీస్ కేసు కూడా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

స్పందనలో వచ్చిన అర్జీలపై

అధికారులు నిర్లక్ష్యం వహించొద్దు

సంయుక్త కలెక్టర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

స్పందనలో వచ్చిన అర్జీల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని జాయింట్ కలెక్టర్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులకు సూచించారు. స్పందన కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం జరిగింది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులు వినతిపత్రాల ద్వారా జిల్లా సంయుక్త కలెక్టర్‌కు విన్నవించారు. కొందరికి తక్షణమే పరిష్కారమార్గం చూపగా.. మరికొన్నింటిని పరిశీలన, విచారణకు ఆదేశించారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. మొత్తం 70 వినతిపత్రాలు నమోదయ్యాయి. కార్యక్రమంలో భాగంగా స్పందన అర్జీలపై జిల్లా అధికారులతో ఆయన సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తున్నందున స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్పందన పోర్టల్‌లో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించేలా అధికారులు పున్నపరిశీలన చేసుకోవాలన్నారు. గడువు తీరిన అర్జీలు పెండింగ్‌లో ఉంటే అధికారులు ఇబ్బందులు పడతారన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్ లో వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కుదరదన్నారు. తదుపరి 294 మంది డిఎంయు వాహనదారులకు రాష్ట్రంలోనే తొలిసారిగా గుర్తింపు కార్డులను జిల్లా సంయుక్త కలెక్టర్ శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.లక్ష్మీశివజ్యోతి, సిపిఒ జి.భరత్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాను

సాహితీ సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల జిల్లాను సాహిత్య సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు బాపట్ల జిల్లా రచయితల సంఘం తన వంతు కృషి చేస్తుందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు తిమ్మన శ్యాంసుందర్ అన్నారు. జిల్లా ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా రసరంజని సౌజన్యంతో సోమవారం జరిగిన బాపట్ల జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. తిమ్మన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో సాహితీ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించేందుకు ప్రతి నియోజక వర్గంలో సాహిత్యం పట్ల ఔత్సాహికులను ప్రోత్సహించి.. ప్రతి నియోజకవర్గాన్ని సాహితీ కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. ముందుగా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి నందిరాజు విజయకుమార్ రచించిన బాపట్ల కీర్తి ప్రతిష్ఠలను తెలియజేసే బాపట్ల ప్రాభవం అను పద్యానికి దృశ్య రూపాన్ని కల్పించి సామాజిక మాధ్యమంలో విడుదల చేశారు. ప్రముఖ వక్త శాంతారామ్ ఈ చిత్రాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ సంగీత కళాకారులు భాగి కృష్ణమూర్తి సంగీత రూపకల్పన చేసి ఆలపించిన ఈ గీతాన్ని షేక్ బాబావలి దృశ్యరూప చిత్రంగా రూపొందించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత వడలి రాధాకృష్ణ, ప్రముఖ సాహితీ విమర్శకులు సజ్జా వెంకటేశ్వర్లు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పోలాసం వీరాంజనేయులు, వెంకటరావు, ఆక్సీ, మేకల రాజు, మస్తాన్ వలి, నాంచారయ్య, కృష్ణకిశోర్, సుభాషిణి పాల్గొన్నారు.

పన్నుల పెంపునకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మేయర్ గంగాడ సుజాతకు అర్జీ ఇస్తున్న కమిటీ నాయకులు

ఆస్తి పన్ను పెంపుదల, ఆస్తి పన్నులో చెత్త సేకరణ పన్ను కలిపి వసూలు చేయవద్దని, చెత్త సేకరణ పన్ను రద్దు చేయాలని, బిల్డింగ్ ప్లాన్, ఇంటిపన్ను విధించే సందర్భంలో రాజకీయ, అధికార సిబ్బంది అవినీతిని అరికట్టాలని కోరుతూ ఆస్తి పన్ను వ్యతిరేక ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమానికి కమిటీ ప్రధాన కార్యదర్శి మారెళ్ల సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆస్తి విలువ ఆధారంగా పన్ను పెంచడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భవిష్యత్తులో ఇంటి విలువ కన్నా ఎక్కువ పన్ను వచ్చే వీలుందని చెప్పారు. చెత్త సేకరణ పన్ను ఇంటి పన్నులో కలపవద్దని డిమాండ్ చేశారు. కలిసివచ్చే ప్రజలతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కమిటీ కార్యదర్శి జి.రమేష్ మాట్లాడుతూ చెత్త సేకరణ పన్ను రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. ఈ పన్నును ఇంటి పన్నుతో కలిపి వసూలు చేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఇంటి పన్నులోనే అన్ని రకాల సేవలకు పన్ను ఉందని చెప్పారు. కానీ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఒంగోలు నగరపాలక సంస్థ పన్నులు పెంచడం జరిగిందన్నారు. నగరంలో పన్నుల వసూళ్ల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధి, సౌకర్యాల కల్పనపై ఉండటం లేదన్నారు. దోమల సమస్య, కుక్కల బెడద, మురికి సమస్య, శివారు కాలనీలలో మంచినీటి సమస్య ఉందని వివరించారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా పన్నుల వసూళ్ల మీద దృష్టి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డింగ్ ప్లాన్లు ఇచ్చేటప్పుడు, ఆస్తి పన్ను విధించే సమయంలో రాజకీయ, అధికార సిబ్బంది అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం మేయర్ గంగాడ సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పౌర సమాజం కన్వీనర్ జి.నరసింహారావు, సిఐటియు నగర నాయకులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, సిటిజన్ అసోషియేషన్ అధ్యక్షులు కొల్లా మధు, అడ్వకేట్ ఎన్‌వి.నర్సయ్య, రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పి సుబ్బారామయ్య చౌదరి, సిఐటియు నగర కార్యదర్శి టి మహేష్, నగర నాయకులు శ్రీరామ శ్రీనివాసులు, ధర్నాసి కోటేశ్వరరావు, కెవిపిఎస్ నగర నాయకులు అత్తింటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి

ఎస్‌పి వకుల్‌జిందాల్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా, సహదయభావంతో వ్యవహరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను స్వయంగా ఎస్పీకి విన్నవించుకున్నారు. ఎస్పీ ప్రతి అర్జీదారునితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను చట్టపరిధిలో పరిష్కారం చూపేలా సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్పందన కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలు మరియు ఇతర సమస్యల గురించి 29 మంది ఫిర్యాదుదారులు అర్జీలు అందజేశారు. స్పందన కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి.మాలకొండయ్య పాల్గొన్నారు.

భూ ఆక్రమణలు అరికట్టాలి: వ్యకాస

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్పందనలో అర్జీ ఇస్తున్న వ్యకాస నాయకులు

జిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న భూ ఆక్రమణలను, అక్రమాలను అరికట్టాలని, భూమిలేని పేదలకు ప్రభుత్వ సాగు భూములు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం స్పందన సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో డిఆర్‌ఒ ఆర్.శ్రీలక్ష్మికి అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గం, హనుమంతునిపాడు మండల పరిధిలో ప్రభుత్వ భూములు వందలాది ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని, పేదల సాగులో ఉన్న భూములు అక్రమంగా పెత్తందారులు ఆక్రమించి అనుభవిస్తున్నారన్నారు. వీటిపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కుల నుండి భూములను స్వాధీనం చేసుకొని ఆ ప్రాంతంలోని భూమిలేని పేదలకు పంచాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి భూ ఆక్రమణలను, అక్రమాలను అరికట్టి పేదలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గూడూరు కొండయ్య, గాలిమోటు ఏసేబు పాల్గొన్నారు.

'స్వర్ణ'లో రేషన్ బియ్యం పట్టివేత

- 810 బస్తాలు స్వాధీనం
- తనిఖీకి వచ్చిన అధికారులు ఫోన్ లాక్కునేందుకు సిబ్బంది యత్నం
- క్రిమినల్ కేసు నమోదు

రైస్‌మిల్లులో ఉన్న రేషన్ బియ్యం

ప్రజాశక్తి-కారంచేడు, మార్టూరు రూరల్

మండలంలోని స్వర్ణ గ్రామంలో ఉన్న ఓ రైస్‌మిల్లులో సోమవారం నాడు విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. రైస్‌మిల్లులో భారీ స్థాయిలో రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రాశులుగా పోసిన రేషన్ బియ్యం పాలిష్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలుస్తోంది. ఇదే రైస్‌మిల్లులో గతంలో అనేకసార్లు దాడులు జరిగి భారీ స్థాయిలో రేషన్ బియ్యం దొరికిన సందర్భాలు ఉన్నాయి. తాజాగా సోమవారం నాడు జరిగిన ఈ తనిఖీల్లో 12 గంటల పాటు పైగా తనిఖీ చేసిన అధికారులకు 810 బస్తాలు మాత్రమే ఉన్నట్లుగా లెక్క తేల్చారు. రైస్‌మిల్లు నిర్వాహకులైన ఐదుగురిపై 6ఎ కేసు, క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల సందర్భంగా అధికారుల వద్ద నుంచి సెల్‌ఫోను గుంజుకోవటానికి ప్రయత్నం చేసిన రైస్ మిల్లు సిబ్బందిపై కూడా కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చీరాల మండలం ఈపురుపాలెంలో ఉన్న వంశీకృష్ణ రైస్ మిల్లుకు తరలించినట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో గుంటూరు విజిలెన్స్ సిఐ శ్రీహరిరావు, తహశీల్దార్ నాగమల్లేశ్వరరావు, విజిలెన్స్ ఎస్ఐ రామచంద్రరావు, ఎన్ఫోర్స్‌మెంట్ డీటీ ఆర్ శరత్ పాల్గొన్నారు.

మాఫియాపై ఉక్కుపాదం మోపాలి

పర్చూరు నియోజకవర్గంలో రేషన్ బియ్యం మాఫియాపై ఉక్కు పాదం మోపి.. కట్టడి చేయాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సోమవారం స్వర్ణ గ్రామంలో అక్రమ రేషన్ దందాపై విజిలెన్స్ అధికారులు తనిఖీల నేపథ్యంలో వారిపై కొందరు అక్రమార్కులు దౌర్జన్యం చేసి దాడికి పాల్పడ్డారన్నారు. అధికార పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు ఈ అక్రమ దందాలో ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించడం, తనిఖీలకు వచ్చిన అధికారులపై దాడులు చేయడం దారుణమన్నారు. అక్రమరేషన్ బియ్యం మాఫియాకు పాల్పడుతున్న సదరు ప్రజాప్రతినిధిపై పీడీ యాక్ట్ నమోదు చేసి..తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.